# ఉన్నతుడు

—సారె రామమోహనరావు

వెంకటేశం మాష్టారంటే పిల్లలకు చాలా హడల్! వాళ్ళు పాఠాలు సరిగా చదవకపోతే ఆయన చేతిలోని చింతబరికె వాళ్ళ వీపుమీద నాట్యం చేస్తుంది. వాళ్ళు స్కూలుకి రోజూ క్రమం తప్పకుండా రాకపోతే వాళ్ళకు గోడ కుర్చీ తప్పదు. అందుకే పిల్లలంతా క్రమం తప్పకుండా స్కూలుకి వస్తారు. చక్కగా పాఠాలు నేర్చుకుంటారు.

వెంకటేశం మాష్టారి సహోద్యోగులకు ఆయనంటే వల్లమాలిన అభిమానం. స్కూల్లో వాళ్ళు పిల్లలకు సరిగా పాఠాలు చెప్పకుండా హస్కు కొడితే వెంకటేశం మాష్టారు 'మీరు పిల్లలకు చక్కగా చదువు చెప్పి వాళ్ళని భావి పౌరులుగా తీర్చి దిద్దడానికి కృషి చెయ్యాలి. అంతేకాని ఇలా హస్కు కొడుతూ కూర్చోవడం కాదు. మనం జీతం తీసుకుంటున్నామంటే ఆ జీతానికి తగ్గ పని చెయ్యాలి. మనం కూలివాడికి పది రూపాయలిచ్చామంటే ఆ పది రూపాయలకు సరిపడే పని చెయించుకోవడం లేదూ? వాడు పని సరిగా చెయ్యకపోతే ఆ పది ఇస్తామా? మన జీతం మన కొస్తుంది, మనల్నడిగే వాళ్ళెవరూ లేరని మనం బాధ్యతారహితంగా ప్రవర్తించ కూడదు. ఉపాధ్యాయుడు అంటే ప్రధాన మంత్రి కన్న గొప్పవాడు. అతడు సరిగా చదువు చెప్పబట్టే ఆ వ్యక్తి ప్రధాన మంత్రి అయారు. లేకపోతే అవగలరా? మీరే ఆలోచించండి. మీ బాధ్యతని గుర్తెరిగి ప్రవర్తించండి' అని సున్నితంగా మందలించేవారు. అందుచేత ఆయన సాటి ఉద్యోగులు కూడ పిల్లలకు సక్రమంగా పాఠాలు చెప్పడానికి ప్రయత్నిస్తుంటారు.

స్కూలు పిల్లల తల్లిదండ్రులకు కూడ ఆయనంటే అభిమానం. 'మాష్టారూ! మా వాడికి ప్రైవేటు చెప్పకూడదూ? మీరడిగినంత ఇస్తాం' అని పిల్లల తల్లిదండ్రులు ఆయన్ని ఎన్నోసార్లడిగారు.

ఆయన నవ్వేవారు.




'మీ పిల్లలకు చెప్పాల్సిందంతా స్కూల్లోనే చెబుతున్నాను. ఇక ప్రైవేటు చెప్పడానికి వేరే ఏముంటుంది?' అని వాళ్ళ కోరికను సున్నితంగా తిరస్కరించేవారు.

విద్యార్థులకు ప్రైవేట్లు చెప్పడం ప్రారంభిస్తే డబ్బు సంపాదించాలని స్కూల్లో సరిగా పాఠాలు చెప్పకుండా ప్రైవేట్లు చెబుతున్నాడనే నిందవస్తుంది. అందుకే ఆయన ఎప్పుడూ ఎవరికి ప్రైవేట్లు చెప్పరు.

వెంకటేశం మాష్టారి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే—

పిన్నలకు,
పెద్దలకు,
ఆయనంటే భయం
ఆయనంటే భక్తి

* * * *

"ఏరా విశ్వం! రాత్రి బాగా చదివావా?" నిన్నటి రోజున పని మీద పొరుగూరు వెళ్ళి అప్పుడే వచ్చిన వెంకటేశం మాష్టారు కొడుకుని ప్రశ్నించారు.

"బాగానే చదివాను నాన్నా!" విశ్వం వినయంగా సమాధాన మిచ్చాడు.

ఆ రోజే టెన్త్ క్లాస్ పరీక్షలు ప్రారంభం.

వచ్చిన ప్రశ్నలు ముందు రాయి. రాని ప్రశ్నలు నెమ్మదిగా ఆలోచించి రాయి చెప్పారు వెంకటేశం మాష్టారు.

'అలాగే నాన్నా!' అని విశ్వం పరీక్ష రాయడానికి బయలు దేరాడు.

కొంచెంసేపు పోయాక వెంకటేశం మాష్టారు కూడ భార్యతో తలుపు వేసుకోమని చెప్పి పరీక్ష హాలుకు

బయలు దేరారు

* * * *

బెల్లు మ్రోగింది

వెంకటేశం మాష్టారు విద్యార్థులకు తెల్ల కాగితాలు, ప్రశ్నాపత్రాలు పంచి పెట్టారు

విద్యార్థులు పరీక్ష రాయడం ప్రారంభించారు

వెంకటేశం మాష్టారు అందరినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు

ప్రశ్నాపత్రం చాలా కఠినంగా వుంది

చాలా మంది విద్యార్థులు కూడా స్లిప్పులు తెచ్చుకున్నారు కాని, వెంకటేశం మాష్టారు వాళ్ల రూముకు ఇన్విజిలేటర్‌గా వచ్చేసరికి వాళ్ళకు భయం పట్టుకుంది స్లిప్పు కొడుతూండగా దొరికిన విద్యార్థిని వెంటనే డిబార్ చేయిస్తాడాయన లోగడ కొంత మంది విద్యార్థులకు అలాగే జరిగింది అందుకే వాళ్ళకు స్లిప్పులు కొట్టడానికి భయంగా వుంది ప్రశ్నలు వచ్చినా రాకపోయినా స్వంతంగా రాయడానికి ప్రయత్నిస్తున్నారు

అసలు ప్రతి విద్యార్థి తెలివైన వాడే! పరీక్షల సమయం వచ్చేసరికి 'ఆ ప్రశ్న రావొచ్చు, ఈ ప్రశ్న రావొచ్చు అని ఒకరి నొకరు తర్జన భర్జన చేసుకుని తికమకపడి వచ్చిన ప్రశ్నలనే మరచిపోతారు అందుకే విద్యార్థులు స్లిప్పులు కొట్టడానికి ప్రయత్నిస్తారు

వెంకటేశం మాష్టారి కళ్ళు ఎక్స్‌రే కళ్ళు ఎలాంటి విద్యార్థి అయినా సరే స్లిప్పులు ఎంత గుంభనంగా కొట్టినా సరే ఆయన ఈజీగా పట్టుకోగలరు

'అయినా –

ఓ విద్యార్థి ధైర్యం చేసి జేబులోంచి స్లిప్పు తీశాడు ఆన్సర్ పేపర్ కిందపెట్టి స్లిప్పు రాస్తున్నాడు

అది వెంకటేశం మాష్టారి కంట పడనే పడింది

గబగబా ఆ విద్యార్థిని సమీపించారు. ఆ విద్యార్థి చేతిలోంచి స్లిప్పు ఆన్సరు పేపరు లాక్కున్నారు. ఆన్సర్ పేపర్‌కు స్లిప్పు తగిలించి 'కాపీడ్" అని రాశారు ఆ తరువాత "ఇక నువ్వు వెళ్ళవచ్చు" అని చెప్పారు

ఆ విద్యార్థి మారు మాట్లాడకుండా బయటకు వెళ్ళి పోయాడు.

కాపీ కొట్టిన ఆ విద్యార్థిని పట్టుకుని తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించినందుకు ఆయన కెంతో తృప్తి కలిగింది. గర్వంతో ఛాతీ వుప్పొంగింది

పరీక్ష ముగిసింది

వెంకటేశం మాష్టారు ఇంటి ముఖం పట్టారు

దూరంగా ఆయన ఇంటి ముందు పెద్ద గుంపు కనిపించింది.

ఏమిటా అనుకుని గబగబా గుంపుని సమీపించారు

గుంపు చీల్చి లోనికి చూశారు

ఎదురుగా కొడుకు విశ్వం శవం. పక్కనే ఖాళీగా వున్న నల్లుల మందు సీసా! భార్య కొడుకు శవం మీద పడి హృదయ విదారకంగా విలపిస్తోంది

దుఃఖంతో ఆయన హృదయం చితికి కన్నీరు కళ్ళ నుండి బొటబొటా కారింది

"నాయనా! విశ్వం! ఎంత పని చేశావు! నా వృత్తి ధర్మాన్ని నేను నిర్వహించాను. అందుకే నువ్వు స్లిప్పు కొడుతూంటే కన్న కొడుకువని కూడ ఆలోచించకుండ పట్టుకున్నాను నా కొడుకువైవుండి కూడా నువ్వు నన్నర్థం చేసుకోలేకపోయావు" తన ఒక్కగా నొక్క కొడుకు శవం మీద కుప్పలా కూలిపోయాడు వున్నతుడు □

